సాక్షి
నల్లగొండ
ఆదివారం । 6 । జూలై । 2025



ఇద్దరి అరెస్ట్
గంజాయి విక్రయిస్తున్న ఇద్దరు వ్యక్తులను కోదాడ రూరల్ పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.
- 8లో



దశదిన కర్మకు వెళ్తొస్తుండగా..
దశదిన కర్మకు బైక్‌పై వెళ్తొస్తున్న తల్లీకుమారుడు కట్టంగూర్ శివారులో హైవేపై ఆగి ఉన్న లారీని ఢీకొట్టి మృతి చెందారు.
- 8లో



మానసిక స్థితి సరిగ్గాలేక..
మానసికస్థితి సరిగ్గా లేని మహిళ తన ఎనిమిది నెలల కుమార్తెతో కలిసి బావిలో దూకి ఆత్మహత్య చేసుకుంది.
- 8లో

న్యూస్‌రీల్

సాగర్‌లో చేపల వేట నిషేధం

నల్లగొండ టూటౌన్ : చేపల ప్రత్యుత్పత్తి కారణంగా నాగార్జునసాగర్ రిజర్వాయర్, రిజర్వాయర్ దిగువన ఈనెల ఒకటి నుంచి ఆగస్టు 31వ తేదీ వరకు చేపల వేట నిషేధించినట్లు మత్స్యశాఖ జిల్లా అధికారి చరిత శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. మత్స్యకారులు దీనిని గమనించాలని కోరారు. చేపల వేట నిషేధించిన ప్రాంతంలో మత్స్యకారులు చేపలు పట్టవద్దని పేర్కొన్నారు. ఎవరైనా ప్రభుత్వ ఆదేశాలను ఉల్లంఘిస్తే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

నానో ఎరువులపై అవగాహన కల్పించాలి



మాట్లాడుతున్న శ్రవణ్‌కుమార్

తిప్పర్తి : నానో యూరియా, డీఏపీపై రైతులకు అవగాహన కల్పించాలని జిల్లా వ్యవసాయ అధికారి శ్రవణ్‌కుమార్ అన్నారు. శనివారం దుప్పలపల్లి మండలంలోని దుప్పలపల్లి గ్రామంలోని రైతు వేదికలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నానో యూరియా వాడకంతో తక్కువ ఖర్చుతో ఎక్కువ దిగుబడి వస్తుందన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ అధికారులు తదితరులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

కక్షిదారులకు సత్వర న్యాయం చేయాలి



కోర్టు పరిసరాలను పరిశీలిస్తున్న జిల్లా జడ్జి

మిర్యాలగూడ టౌన్ : పెండింగ్ కేసులను తగ్గించేందుకు, కక్షిదారులకు సత్వర న్యాయం అందించేందుకు కృషి చేయాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎం.నాగరాజు అన్నారు. శనివారం మిర్యాలగూడలో కోర్టును పరిశీలించారు. కోర్టులోని అన్ని విభాగాలు, న్యాయమూర్తుల ఉండే నివాస గృహాలను సందర్శించారు. అనంతరం న్యాయవాదులతో సమావేశమై సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అదనపు జూనియర్ సివిల్ జడ్జి కోర్టు, సీనియర్ సివిల్ జడ్జి కోర్టు మంజూరు చేయాలని, బార్ అసోసియేషన్ భవనం, స్త్రీశక్తి పథకం కింద క్యాంటిన్, జిరాక్స్ సెంటర్ ఏర్పాటుకు అనుమతి ఇవ్వాలని జిల్లా న్యాయమూర్తిని బార్ అసోసియేషన్ అధ్యక్షుడు నేతి సత్యనారాయణ కోరారు. అందుకు ఆయన సానుకూలంగా స్పందించారు. జిల్లా జడ్జి వెంట ఐదవ అదనపు జిల్లా న్యాయమూర్తి జి.వేణు, సీనియర్ సివిల్ జడ్జి సుజయ్‌కుమార్, రెండవ అదనపు జూనియర్ సివిల్ న్యాయమూర్తి అరుణ్ తేజ్, మిర్యాలగూడ బార్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు నేతి సత్యనారాయణ, అలుగుబెల్లి భూపతిరెడ్డి, కోశాధికారి సాయికుమార్, లింగంపల్లి శ్రీనివాస్, కరుణం లింగయ్య, సుంకి శ్రీను, నాయుడు, రాజశేఖర్, కామేశ్వర్‌రెడ్డి, ఎల్లయ్య, ప్రసాద్, బాలు తదితరులు ఉన్నారు.



నీటితో కళకళలాడుతున్న మూసీ రిజర్వాయర్

641 అడుగులకు మూసీ నీటిమట్టం

కేతేపల్లి : మూసీ ప్రాజెక్టుకు ఎగువ నుంచి ఇన్‌ఫ్లో కొనసాగుతోంది. దీంతో ప్రాజెక్టులో 20 రోజులుగా నిలకడగా ఉన్న నీటిమట్టం క్రమం పెరుగుతూ 641 అడుగులకు చేరింది. రెండు రోజుల నుంచి మూసీ ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలతో మూసీకి వరద రాక ప్రారంభమైంది. శనివారం ఎగువ ప్రాంతాల నుంచి 280 క్యూసెక్కుల నీరు వస్తోందని ప్రాజెక్టు అధికారులు తెలిపారు. దీంతో 645 అడుగుల గరిష్ఠ నీటిమట్టం(4.66 టీఎంసీలు) గల మూసీ ప్రాజెక్టులో.. శనివారం సాయంత్రం నాటికి 641.60 (3.58 టీఎంసీలు) అడుగులకు చేరుకుంది. ఆవిరితో పాటు, సీపేజి, లీకేజీ రూపంలో 68 క్యూసెక్కుల నీరు వృథా అవుతోందని ప్రాజెక్ట్ అధికారులు పేర్కొన్నారు.

చేప పిల్లలపంపిణీ బిల్లులకు చెల్లు!

- పంపిణీలో అక్రమాలే కారణం
- చేప పిల్లలు పోయకున్నా పోసినట్లు బిల్లులు
- ఫిర్యాదులు అందడంతో బిల్లుల నిలిపివేత



నల్లగొండ టూటౌన్ : మత్స్యకారుల జీవనోపాధి కోసం రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ఉచిత చేప పిల్లల పంపిణీకి సంబంధించిన కాంట్రాక్టర్లకు ప్రభుత్వం బిల్లులు నిలిపివేసినట్లు తెలిసింది. ఈ పథకంలో భారీగా అక్రమాలు, అవినీతి చోటు చేసుకోవడంతో ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. మత్స్యశాఖ అధికారులు సుమారు రూ.2.75 కోట్లు బిల్లులు చేసి పంపగా అదనపు కలెక్టర్ వాటిని పక్కన పెట్టారు. నాణ్యతలేని చేపపిల్లలు పోశారని.. కొన్నిచోట్ల అసలు పోయకుండానే బిల్లులు పెట్టారని ఆరోపణలు రావడంతో బిల్లులు నిలిపివేసినట్లు తెలుస్తోంది.

తక్కువ పిల్లలు తెచ్చి.. ఎక్కువ అని చెబుతూ

జిల్లా వ్యాప్తంగా డిపార్ట్‌మెంట్, రిజర్వాయర్లు, గ్రామ పంచాయితీ చెరువులు కలిపి దాదాపు 1,100 వరకు ఉన్నాయి. వీటన్నింలో చేప పిల్లలు పోయాలంటే 5.50 కోట్ల వరకు అవసరం ఉంటుంది. కానీ ప్రభుత్వం గతేడాది 3 కోట్ల వరకు ఉచిత చేప పిల్లలను కేటాయించింది. రాష్ట్ర ప్రభుత్వం కాంట్రాక్టర్ల ద్వారా పంపిణీ చేసిన ఉచిత చేప పిల్లల పంపిణీపై అప్పట్లోనే సర్వత్రా విమర్శలు వచ్చాయి. కట్టంగూరు మండలంలో తక్కువ చేప పిల్లలు తెచ్చి ఎక్కువ అని చెప్పే ప్రయత్నం చేయగా ఎమ్మెల్యే వేముల వీరేశం డబ్బాలోని చేప పిల్లలను సిబ్బందితో లెక్కింపజేశారు. 50 వేల పిల్లలు ఉండాల్సిన డబ్బాలో 35 వేలు మాత్రమే ఉన్నాయి. ఒక్క డబ్బాలోనే 15 వేలు తక్కువగా వచ్చినట్లు తేలింది. ప్రతిచోటా ఇలా అక్రమాలకు పాల్పడినట్లు ఆరోపణలు వెలువెత్తిన విషయం తెలిసిందే.

పిల్లలు పోయకుండానే..

నల్లగొండ, మిర్యాలగూడ, నాగార్జునసాగర్, నకిరేకల్ నియోజకవర్గాల్లోని కొన్ని చెరువుల్లో చేప పిల్లలు పోయడానికి కాంట్రాక్టర్లు తీసుకెళ్లగా నాణ్యత లేని పిల్లలు ఎందుకు అని మత్స్యకారులు అభ్యంతరం తెలపడంతో చేప పిల్లలు పోయకుండానే వెనుదిరిగి వెళ్లారు. మళ్లీ చేప పిల్లలు తేకుండానే చేప పిల్లలు పోసినట్లు సంబంధిత కాంట్రాక్టర్లు మత్స్యశాఖ అధికారుల ద్వారా బిల్లులు పెట్టించినట్లు తెలిసింది. చేప పిల్లల పంపణీలో భారీగా అక్రమాలు జరిగినట్లు గతేడాది జరిగిన పలు సమావేశాల్లో శాసనసభ్యులు సైతం అధికారుల తీరును ఎండగట్టిన విషయం తెలిసిందే. ఈ విషయాన్ని పలువురు ఎమ్మెల్యే కలెక్టర్ దృష్టికి తీసుకుపోయినట్లు గతంలోనే చర్చ జరిగింది.

బరువు పెరగని పిల్లలు..

నాణ్యత లేని పిల్లలను తెచ్చి అంట గట్టారని.. పోసిన పిల్లలు ఏడాది అవుతున్నా కనీసం బరువు పెరగలేదని మత్స్యకారుల నుంచి ఫిర్యాదులు అందాయి. గుర్రంపోడు, కనగల్ మండలాల్లో పోసిన చేపపిల్లలు ఇప్పటి వరకు చేప పిల్లలు పావు కిలో బరువు కూడా పెరగకపోవడంతో మత్స్యకారుల జీవనోపాధిపై ప్రభావం పడింది. ఏదైనా ఒక మండలంలో ఉచిత చేప పిల్లల పంపిణీ.. పెట్టిన బిల్లులకు సంబంధించిన అంశంపై విచారణ చేయిస్తే అసలు బాగోతం బయటపడే అవకాశం ఉన్నట్లు మత్స్యకారులు చెబుతున్నారు. మరి ఆ దిశగా అధికారులు విచారణ జరిపిస్తారా లేక రాజకీయ నాయకుల ఒత్తిళ్లకు తలొగ్గి మమ అనిపిస్తారా అనేది వేచి చూడాలి. కాగా బిల్లుల బ్రేక్, అక్రమాలపై వివరణ కోసం మత్స్యశాఖ అధికారిని చరితను ఫోన్‌లో సంప్రదించగా అందుబాటులోకి రాలేదు.

విపత్తుల నిర్వహణకు సిద్ధంగా ఉన్నాం

- కలెక్టర్ ఇలా త్రిపాఠి



మాట్లాడుతున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి

నల్లగొండ : విపత్తుల నిర్వహణకు జిల్లా యంత్రాంగం సిద్ధంగా ఉంటుందని కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. శనివారం జాతీయ విపత్తుల నిర్వహణ అథారిటీ అధికారుల బృందం కలెక్టరేట్‌లో కలెక్టర్‌ను కలిసిన సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. జిల్లాస్థాయిలో విపత్తుల నిర్వహణ అథారిటీని ఏర్పాటు చేశామని.. అందులో అన్ని శాఖల అధికారులను భాగస్వామ్యం చేశామని తెలిపారు. విపత్తులను ఎదుర్కొనేందుకు జిల్లా యంత్రాంగాన్ని సిద్ధం చేశామని వడదెబ్బ, వరదలు, తుఫానులు, ప్రమాదాల సమయాల్లో తీసుకోవాల్సిన చర్యలపై సమావేశాలు నిర్వహించామన్నారు. ఎస్పీ శరత్‌చంద్ర పవార్ మాట్లాడుతూ జిల్లాలో 12వ పోలీస్ బెటాలియన్‌కు విపత్తు నిర్వహణపై శిక్షణ ఇచ్చినట్లు తెలిపారు. జాతీయ విపత్తుల నిర్వహణ అథారిటీ జాయింట్ అడ్వైజర్ నావెల్ ప్రకాష్ మాట్లాడుతూ జాతీయ విపత్తుల నిర్వహణ అథారిటీ కింద 2021లో ఆపదమిత్ర వలంటీర్ల వ్యవస్థను ఏర్పాటు చేశామని తెలిపారు. ఆపద మిత్రుల శిక్షణ, విపత్తుల్లో వారు తీసుకోబోయే చర్యలకు అవసరమైన సహాయం అందజేస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో జాతీయ విపత్తు బృందం సభ్యులు అభిషేక్ బీస్వాల్, వసీం ఇక్బాల్, గౌతమ్, రెవెన్యూ అదనపు కలెక్టర్ జె.శ్రీనివాస్, సబ్ కలెక్టర్ నారాయణ్ అమిత్, ఆర్డీఓ వై.అశోక్ రెడ్డి, డీఆర్‌డీఓ శేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆపదమిత్రలు ప్రజలకు అవగాహన కల్పించాలి

నల్లగొండ : విపత్తు సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఆపదమిత్రలు ప్రజలకు అవగాహన కల్పించాలని విపత్తుల నిర్వహణ అథారిటీ జాయింట్ అడ్వైజర్ నావల్ ప్రకాష్ అన్నారు. శనివారం నల్లగొండలోని కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఆపదమిత్ర వలంటీర్లు, జిల్లా అధికారులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వరదలు, తుఫాన్లు, భూకంపాలు వంటి విపత్తులు వచ్చినప్పుడు జాతీయ, రాష్ట్ర విపత్తు బృందాలు వచ్చేలోగా సహాయకరంగా ఉండేందుకు ఆపద మిత్ర వలంటీర్లను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. రెవెన్యూ అదనపు కలెక్టర్ జె.శ్రీనివాస్ మాట్లాడుతూ జిల్లాలో ఆపదమిత్రలు బాగా పనిచేస్తున్నారని, వారికి మూడు విడతల్లో శిక్షణ ఇచ్చామని తెలిపారు. సమావేశంలో జాతీయ విపత్తుల నిర్వహణ అథారిటీ అండర్ సెక్రెటరీ అభిషేక్ బీస్వాల్, వసీం ఇక్బాల్, డీఆర్‌డీఓ శేఖర్‌రెడ్డి, జిల్లా అగ్నిమాపక అధికారి సుదేశ్‌కుమార్ పాల్గొన్నారు.

నందికొండ నివాసాలకు నోటీసులు

- అద్దె చెల్లించాలని నోటీసులిస్తున్న ఎన్‌ఎస్పీ అధికారులు
- గతంలో రిజిస్ట్రేషన్ అయిన ఇళ్లకు కూడా అందజేత
- ఆందోళనలో కాలనీ వాసులు



నందికొండలోని హిల్‌కాలనీ

నాగార్జునసాగర్ : నందికొండ మున్సిపాలిటీలోని కాలనీల్లోని ఇళ్ల యజమానులు అద్దె చెల్లించాలంటూ ఎన్నెస్పీ అధికారులు నోటీసులు పంపుతున్నారు. 58, 59 జీఓల ప్రకారం నందికొండలో 1300 వందల మంది గత ప్రభుత్వంలో ఇళ్లను కొనుగోలు చేశారు. ఈలోపు ప్రభుత్వం మారడంతో 2,331 మంది దరఖాస్తుదారుల ఇళ్ల రిజిస్ట్రేషన్ ఆగింది. ఈ దరఖాస్తులన్నీ ప్రస్తుతం పెండింగ్‌లో ఉన్నాయి. ఇప్పుడు రిజిస్ట్రేషన్ కాని ఇళ్లతోపాటు రిజిస్ట్రేషన్ అయిన ఇళ్ల యజమానులకు కూడా ఎన్నెస్పీ అధికారులు నోటీసులు పంపుతున్నారు. దీంతో కాలనీవాసుల్లో ఆందోళన మొదలైంది.

ఇళ్లు, ఇళ్ల స్థలాలన్నీ ఎన్ఎస్పీవే..

నందికొండలో ఉన్న ఇళ్లు, ఇళ్ల స్థలాలన్నీ నాగార్జున సాగర్ ప్రాజెక్టుకు సంబంధించినవే. 1955లో ప్రాజెక్టు నిర్మాణ సమయంలో ఉద్యోగులు, కంట్రాక్టర్లు, కూలీలు నివాసముండేందుకు తాత్కాలికంగా క్వార్టర్లను నిర్మించారు. పాతిక సంవత్సరాల క్రితమే వాటిని మేయింటెనెన్స్ చేయకుండా వదిలేశారు. మనుషులు లేని ఇళ్లు కూలిపోయాయి. ఇళ్లకు సొంత ఖర్చులతో మరమ్మతులు చేయించుకుంటూ నివాసమున్న క్వార్టర్లే ఇప్పుడు ఉన్నాయి.

ప్రస్తుతం ఆగిన రిజిస్ట్రేషన్లు..

రాష్ట్ర వ్యాప్తంగా నగరాలు, పట్టణాల్లో ప్రభుత్వ భూముల్లో ఇళ్లు నిర్మించుకుని నివాసాలుంటున్న ప్రజలకు ఆనాటి బీఆర్ఎస్ ప్రభుత్వం జీఓ 58, 59 ప్రకారం వాటిని అప్పగించింది. అందులో భాగంగా మొదటి దఫాలో నందికొండలో సుమారు 1300 మందికి ఇళ్లు రిజిస్ట్రేషన్ అయ్యాయి. అప్పట్లో ప్రభుత్వం కటాఫ్ తేదీని 2 జూన్ 2014గా పెట్టంది. దీంతో చాలామంది అవగాహన లేక దరఖాస్తు చేసుకోలేదు. దీంతో ఆనాటి మంత్రులు, ఎమ్మెల్యేల సూచనల మేరకు కటాఫ్ తేదీని 2జూన్ 2020 వరకు పొడిగించింది. దరఖాస్తులకు ఏప్రిల్ 2023 మే31వ తేదీ వరకు అవకాశం కల్పించింది. దీంతో నందికొండలో జీఓ 58 ప్రకారం 943 మంది, జీఓ 59 ప్రకారం 1388 మంది దరఖాస్తు చేసుకున్నారు. ప్రస్తుతం ఈ జీఓలను రాష్ట్ర ప్రభుత్వం హోల్డ్‌లో పెట్టింది. ప్రస్తుతం ఇళ్లు రిజిస్ట్రేషన్ అయిన వారితోపాటు.. దరఖాస్తు చేసుకున్న వారికి కూడా ప్రస్తుతం నోటీసులు ఇస్తున్నారు. స్థానిక ఎమ్మెల్యే కలుగజేసుకోని నోటీసులు ఇవ్వకుండా చూడాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు. మిగతా వారికి కూడా ఇళ్లు రిజిస్ట్రేషన్ అయ్యేలా ప్రత్యేక జీఓ తేవాలని కోరుతున్నారు.

భూ నిర్వాసితులకు ఉపాధి కల్పించాలని వినతి

మిర్యాలగూడ : దామరచర్ల మండలం వీర్లపాలెంలోని యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్ నిర్మాణ సమయంలో భూములు కోల్పోయిన వారికి ప్లాంట్‌లో ఉపాధి అవకాశాలు కల్పించాలని కోరుతూ వీర్లపాలెం గ్రామస్తులు శనివారం నల్లగొండలో కలెక్టర్ ఇలా త్రిపాఠికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పలువురు గ్రామస్తులు మాట్లాడుతూ భూములు కోల్పోయిన వారికి ప్లాంట్‌లో ఉపాధి కల్పిస్తామని ప్రభుత్వం హామీ ఇచ్చిందని, కానీ ఇప్పటివరకు ఎలాంటి స్పందన లేదన్నారు. ఉన్నతాధికారులు స్పందించి ప్రతి కుటుంబానికి ఉపాధి కల్పించాలని కోరారు. వారి వినతిపై స్పందించిన కలెక్టర్ త్వరలోనే గ్రామానికి వచ్చి సమస్యను తెలుసుకొని పరిష్కరిస్తానని హామీ ఇచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో శ్రీనునాయక్, లక్ష్మణ్‌గౌడ్, వెంకటేశ్వర్లు, నాగరాజు తదితరులు ఉన్నారు.

సమష్టి గెలుపునకు సాధనం సహకార వ్యవస్థ



మాట్లాడుతున్న వైస్ చాన్స్‌లర్ ఖాజా అల్తాఫ్ హుస్సేన్

- ఎంజీయూ వీసీ ఖాజా అల్తాఫ్ హుస్సేన్

నల్లగొండ టూటౌన్: విద్యార్థుల సమష్టి గెలుపునకు సాధనం సహకార వ్యవస్థ అని మహాత్మాగాంధీ యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ ఖాజా అల్తాఫ్ హుస్సేన్ అన్నారు. నల్లగొండలోని ఎంజీయూటీలో ఇనిస్టిట్యూట్ ఆఫ్ కోపరేటివ్ మేనేజ్‌మెంట్ శనివారం ఏర్పాటు చేసిన జాతీయ సెమినార్‌లో ఆయన పాల్గొని మాట్లాడారు. జూలై మొదటి శనివారాన్ని సహకార దినోత్సవంగా పాటించాలన్నారు. సహకార వ్యవస్థ ద్వారా గ్రామాలు విజయ పథంలో దూసుకెళ్లాని వివరించారు. విద్యార్థులకు సైతం సహకార సంఘాలు ఏర్పాటు చేసే విషయాన్ని పరిశీలించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐసీఎం డైరెక్టర్ డాక్టర్ ఆర్. గణేషన్, శార్దూల్ జాదవ్, పత్యానాయక్, శ్రీదేవి, ఆకుల రవి, కొప్పుల అంజిరెడ్డి, ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ అరుణప్రియ, ప్రసాద్ పాల్గొన్నారు.



క్లౌడ్ కిచెన్
ఆన్‌లైన్‌లో.. ఇంటి ఆహారం

- చిన్న పట్టణాలకు విస్తరించిన క్లౌడ్ కిచెన్ ట్రెండ్
- ఇంట్లో వంటచేసి స్విగ్గీ, జొమాటో ద్వారా సప్లయ్
- వెజ్, నాన్‌వెజ్ వంటకాలతోపాటు అల్పాహారం
- క్లౌడ్ కిచెన్ ఏర్పాటుకు మహిళల ఆసక్తి



క్లౌడ్ కిచెన్‌లో తయారైన వంటకాలు

సండే స్పెషల్

ఆకలైతే వంట చేసుకుని తినే రోజుల నుంచి ఆర్డర్ పెట్టెయ్ అనే కాలం వచ్చింది. మనకు కావాల్సిన ఆహారాన్ని, నచ్చిన హోటల్, రెస్టారెంట్ నుంచి ఇంట్లోనే కూర్చుని ఆన్‌లైన్‌లో ఆర్డర్ పెడితే కొద్ది సమయంలోనే మన చేతిలోకి వస్తుంది. ఇప్పటి వరకు హోటళ్లు, రెస్టారెంట్లు మాత్రమే ఫుడ్ డెలివరీ యాప్‌కు అనుసంధానంగా ఉండగా.. ఇప్పుడు కొత్తగా క్లౌడ్ కిచెన్ అందుబాటులోకి వచ్చింది. నల్లగొండ, సూర్యాపేట, మిర్యాలగూడలో పలువురు ఇంట్లో వంట చేస్తూ ఆన్‌లైన్ ద్వారా సప్లయ్ చేస్తున్నారు. ఇందుకు పెద్దగా పెట్టుబడి కూడా అవసరం లేకపోవడంతో క్లౌడ్ కిచెన్ ఏర్పాటుకు మహిళలు ఆసక్తి చూపిస్తున్నారు.

రామగిరి(నల్లగొండ): ప్రస్తుతం ఆన్‌లైన్ ఫుడ్ డెలివరీ రంగం వేగంగా వృద్ధి చెందుతోంది. ఇందులో క్లౌడ్ కిచెన్ కాన్సెప్ట్ ప్రజాదరణ పొందుతోంది. తక్కువ పెట్టుబడితో క్లౌడ్ కిచెన్ వ్యాపారాన్ని ప్రారంభించవచ్చు. ఇంట్లోని వంటగదిని క్లౌడ్ కిచెన్‌గా మార్చుకోవచ్చు. రెస్టారెంట్‌లా అధిక ఖర్చులు పెట్టాల్సిన అవసరం లేదు. ఆన్‌లైన్ ప్లాట్‌ఫామ్ ద్వారా వ్యాపారం చేయాలనుకునే వారికి ఇది చాలా బాగా ఉపయోగపడుతుంది. రెస్టారెంట్‌తో పోల్చుకుంటే అతి తక్కువ ఖర్చుతో మన ఇంట్లోనే సెట్ చేసుకోవచ్చు.



నల్లగొండలో క్లౌడ్ కిచెన్‌లో భాగంగా ఆర్డర్ల కోసం ఆహారం సిద్ధం చేస్తున్న జ్యోతి

తక్కువ పెట్టుబడితో ఏర్పాటు

తక్కువ పెట్టుబడితో ఎక్కువ రాబడినిచ్చే క్లౌడ్ కిచెన్ ప్రస్తుతం మన నల్లగొండ, సూర్యాపేట, మిర్యాలగూడకు కూడా విస్తరించింది. ఆన్‌లైన్ ఫుడ్‌కు అధిక ప్రాచుర్యం ఉండడంతో నల్లగొండ పట్టణంలోని వీటీ కాలనీకి చెందిన జ్యోతి ఇంట్లోని వంట గదిని ఫుడ్ డెలివరీ బిజినెస్‌కు అనుకూలంగా మలుచుకుంది. 'నాటు.. యమ ఘాటు' పేరుతో జొమాటో, స్విగ్గీ ద్వారా తన ఫుడ్‌ను ఆన్‌లైన్ ద్వారా సప్లయ్ చేస్తున్నారు. ఈమెతోపాటు నల్లగొండలో పలువురు మహిళలు క్లౌడ్ కిచెన్ ఏర్పాటు చేశారు. ఇంట్లో చేసిన వంట కావడంతో చాలా మంది క్లౌడ్ కిచెన్‌కు ఆర్డర్లు ఇస్తున్నారు.

స్కిల్స్‌తో వ్యాపారం చేయవచ్చు

వ్యాపారం చేయాలంటే విభిన్న ఆలోచనలతో పాటు అందుకు తగ్గట్టుగా స్కిల్స్ ఉండాలి. అప్పుడే అందులో రాణించగలుగుతాం. ప్రస్తుతం మార్కెట్‌లో క్లౌడ్ కిచెన్‌కు మంచి స్పందన వస్తోంది. వంటలో ప్రావీణ్యం ఉండి సొంతంగా బిజినెస్ చేయాలనుకునే వారికి క్లౌడ్ కిచెన్ సదవకాశం. మూడు నెలల క్రితం నేను క్లౌడ్ కిచెన్ ప్రారంభించాను. ప్రస్తుతం రోజుకు 10 వరకు ఆర్డర్లు వస్తున్నాయి. దీనికి లొకేషన్‌తో సంబంధం లేదు. జనం రద్దీగా ఉండే ప్రాంతానికి దగ్గరగా ఉంటే మంచిది. జొమాటో, స్విగ్గీ డెలివరీ ఆప్షన్ ఉండేలా చూసుకోవాలి. ప్రస్తుతం ఫుడ్, కిరాణా డెలివరీతో పాటు క్లౌడ్ కిచెన్ వ్యాపారం కూడా పుంజుకుంటోంది.

\- బి.జ్యోతి, క్లౌడ్ కిచెన్ నిర్వాహకురాలు, నల్లగొండ



డెలివరీ బాయ్‌కి ఫుడ్ అందజేస్తున్న జ్యోతి

ఆన్‌లైన్ డెలివరీలు మాత్రమే..

సాధారణంగా రెస్టారెంట్ ఏర్పాటు చేయాలంటే.. వంట బాగా వచ్చిన వారిని పెట్టుకోవాలి. అది బోలెడంత ఖర్చుతో కూడుకున్న పని కావడంతో చాలా వరకు హోటల్ బిజినెస్ చేయాలనుకునే వారు వెనకడుగు వేస్తుంటారు. ఈ సమస్యకు పరిష్కారంగా వచ్చినవే క్లౌడ్ కిచెన్‌లు. క్లౌడ్ కిచెన్ ద్వారా కేవలం ఆన్‌లైన్ డెలివరీ మాత్రమే ఉంటుంది. ఆన్‌లైన్ ఆర్డర్లకైతే పెద్ద భవనం అవసరం లేదు. ఖరీదైన ఫర్నిచర్, వెయిటర్లు.. ఇలాంటి ఖర్చులేవీ ఉండవు. ప్రస్తుతం హైదరాబాద్ లాంటి పెద్దపెద్ద నగరాల్లో క్లౌడ్ కిచెన్‌లు అందుబాటులో ఉన్నాయి. ఇప్పుడిప్పుడే చిన్నచిన్న పట్టణాలకు విస్తరిస్తున్నాయి. క్లౌడ్ కిచెన్‌లో బిర్యానీ దగ్గర్నుంచి కూరలు, టిఫిన్లు, స్వీట్లు ఇలా ఎన్నో రకాల వంటకాలు ఆన్‌లైన్ ద్వారా లభిస్తున్నాయి.



జ్యోతి తయారు చేసిన మాంసాహార వంటకాలు

క్లుప్తంగా

చెరువులో పడి వృద్ధుడు మృతి

బీబీనగర్: ప్రమాదవశాత్తు చెరువులో జారిపడి వృద్ధుడు మృతిచెందాడు. ఈ ఘటన హైదరాబాద్–వరంగల్ జాతీయ రహదారిపై బీబీనగర్ మండల కేంద్రంలోని పెద్ద చెరువులో శనివారం జరిగింది. సీఐ ప్రభాకర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. మేడ్చల్–మల్కాజ్‌గిరి జిల్లా ఘట్‌కేసర్ మండలం అవుషాపూర్‌కు చెందిన బొంకేంపల్లి సాయిలు(70) భిక్షాటన చేస్తూ సంచార జీవనం సాగిస్తున్నాడు. శనివారం ఉదయం అతడు బీబీనగర్ మండల కేంద్రంలోని పెద్ద చెరువు ఒడ్డున బట్టలు ఉతుక్కొని, స్నానం చేసేందుకు చెరువులోకి దిగగా.. ప్రమాదవశాత్తు జారి చెరువులో మునిగి మృతి చెందాడు. చెరువు వద్దకు చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని వెలికితీసి పోస్టుమార్టం నిమిత్తం భువనగిరి ఏరియా ఆస్పత్రికి తరలించారు. మృతుడి కుమారుడు జగన్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

గడ్డిమందు తాగి వ్యక్తి బలవన్మరణం

పెన్‌పహాడ్: అనారోగ్యంతో బాధపడుతున్న వ్యక్తి జీవితంపై విరక్తితో గడ్డిమందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన పెన్‌పహాడ్ మండలం చీదెళ్ల గ్రామంలో శనివారం జరిగిది. ఏఎస్ఐ రాములు తెలిపిన వివరాల ప్రకారం.. చీదెళ్ల గ్రామానికి చెందిన వెన్న వెంకటరెడ్డి(58) కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. జీవితంపై విరక్తి చెంది ఆయన తన ఇంట్లో గడ్డి మందు తాగాడు. అనంతరం గడ్డి మందు తాగినట్లు బయట ఉన్న భార్య పద్మకు చెప్పడంతో చుట్టుపక్కల వారి సహాయంతో సూర్యాపేట ఏరియా ఆస్పత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ మృతిచెందాడు. మృతుడి కుమారుడు నవీన్‌రెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఏఎస్ఐ తెలిపారు.

ఇంట్లో నగదు చోరీ

పెన్‌పహాడ్: గుర్తుతెలియని వ్యక్తులు ఇంట్లో చొరబడి బీరువా పగులగొట్టి నగదు అపహరించారు. ఈ ఘటన శనివారం పెన్‌పహాడ్ మండల పరిధిలోని దూపహాడ్ గ్రామంలో జరిగింది. హెడ్‌కానిస్టేబుల్ ఆంగోతు యాదగిరి తెలిపిన వివరాల ప్రకారం.. దూపపహాడ్ గ్రామానికి చెందిన పత్తిపాక సైదులు శనివారం మధ్యాహ్నం తన ఇంటికి తలుపులు పెట్టి గాలిమిషన్ వద్దకు వెళ్లి తిరిగి వచ్చేసరికి గుర్తుతెలియని వ్యక్తులు ఇంట్లోకి ప్రవేశించి బీరువా తాళం పగులగొట్టి రూ.2వేలు ఎత్తుకెళ్లారు. సైదులు ఇంటికి తిరిగి వచ్చేసరికి చోరీ జరిగినట్లు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్‌కానిస్టేబుల్ తెలిపారు. గ్రామస్తులు దొంగను పట్టుకొని దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించినట్లు సమాచారం.

శ్మశానంలోనే ఆమె బతుకు బండి

- భర్త మృతి అనంతరం కాటికాపరిగా పనిచేస్తున్న మహిళ

చీకటి పడిందంటే సాధారణంగా బయటకు వెళ్లేందుకు మహిళలు భయపడతారు. కానీ ఈ మహిళ రాత్రి, పగలు అనే తేడాలేకుండా శ్మశానంలోనే చితిమంటల మధ్య జీవనం సాగిస్తోంది. భర్త మృతి అనంతరం అతడి దారిలోనే కాటికాపరిగా పనిచేస్తూ బతుకు బండిని లాగుతోంది.



మిర్యాలగూడ పట్టణంలోని హిందూ శ్మశవాటికలో కాటికాపరిగా పనిచేస్తున్న పత్తిపాటి మణెమ్మ

జీవితం

మిర్యాలగూడ టౌన్: సూర్యాపేట జిల్లా గరిడేపల్లి మండలం గడ్డిపల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని ఎర్రకుంట గ్రామానికి చెందిన పత్తిపాటి ప్రకాశం, మణెమ్మ దంపతులకు ఇద్దరు కుమారులు, కుమార్తె సంతానం. వారికి కూలీ పని చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకునేవారు. ఊళ్లో కూలీ పనులు దొరక్కపోవడంతో 26 ఏళ్ల క్రితం బతుకుదెరువు కోసం మిర్యాలగూడ పట్టణానికి వలస వచ్చారు. తమకు తెలిసిన వారి ద్వారా మిర్యాలగూడ పట్టణంలోని హిందూ శ్మశానవాటికలో కూలీ పనికి కుదిరారు. ఇక్కడే కాటికాపరిగా స్థిరపడ్డారు. ఆ తర్వాత ఐదేళ్లకు అనారోగ్యంతో ప్రకాశం మృతిచెందాడు. అప్పటి నుంచి మణెమ్మనే కాటికాపరిగా పనిచేస్తోంది. తాము ఇక్కడికి వచ్చినప్పటి నుంచి లయన్స్ క్లబ్ అధ్యక్షుడు చిల్లంచర్ల అనంతరాములే తమ కుటుంబానికి పెద్ద దిక్కుగా నిలిచారని, తన భర్త బతికి ఉన్నప్పి నుంచి కూడా అనంతరాములే తమకు జీతం ఇస్తున్నారని మణెమ్మ పేర్కొంది. మొదట్లో ప్రతినెల రూ.600 వరకు జీతం ఇచ్చేవారని, ఇప్పుడు రూ.1000 ఇస్తున్నారని తెలిపింది. తనకు కిడ్నీలో రాళ్లు వస్తే ఆపరేషన్ ఖర్చు కూడా ఆయనే భరించారని పేర్కొంది.

వితంతు పింఛనే ఆధారం..

కరోనా సమయంలో ఎవరు కూడా మృతదేహాలను కాల్చేందుకు ముందుకు రాకపోవడంతో మణెమ్మనే దగ్గరుండి దహన సంస్కారాలు నిర్వహించింది. ఇప్పటికీ ఆమెకు సొంతిళ్లు కూడా లేదు. వితంతు పింఛన్ డబ్బులే కొంత మేరకు ఆమెకు ఆధారం. ఇంటి స్థలం మంజూరు చేయాలని ప్రజా ప్రతినిధులు, అధికారులను మణెమ్మ కోరుతోంది. శ్మశానవాటికలో పనిచేస్తూనే తన ఇద్దరు కుమారులు, కుమర్తెకు వివాహాలు చేసింది. మణెమ్మకు ఔట్‌సోర్సింగ్ కింద పారిశుద్ధ్య కార్మికులకు ఏవిధంగా వేతనాలు ఇస్తున్నారో అదే రీతిలో వేతనం ఇస్తే బాగుండేదని స్థానికులు అంటున్నారు.

మొదట్లో చాలా భయమేసింది



మొదట్లో శవాన్ని దహనం చేస్తుంటే చాలా భయమేసేది. కానీ తర్వాత అలవాటుగా మారిపోయింది. నేను శవాలను దహనం చేయడం ఒక సేవగా భావిస్తున్నాను. నా పిల్లలందరికీ వివాహాలు అయ్యాయి. పెద్ద కుమారుడు తాపీ మేస్త్రీగా, చిన్న కుమారుడు కారు డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. కోడళ్లు కూడా నాకు చేదోడు వాదోడుగా ఉంటున్నారు. ప్రభుత్వం కనీసం ఇంటి స్థలం అయినా ఇచ్చి ఆదుకోవాలి. మున్సిపాలిటీ కార్మికులకు వచ్చే విధంగా వేతనమైనా ఇస్తే బాగుంటుంది.

– పత్తిపాటి మణెమ్మ

కుర్రి శ్రీనుకు నివాళులర్పించిన మంత్రి ఉత్తమ్

- మృతుడి కుటుంబానికి ప్రభుత్వం నుంచి రూ.10లక్షలు ఇస్తామని ప్రకటన
- తక్షణ సహాయం కింద సొంతంగా రూ.5లక్షలు అందజేత
- హైదరాబాద్‌లో కాంగ్రెస్ సభకు వెళ్లొస్తుండగా కట్టంగూర్ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో శ్రీను మృతి



నకిరేకల్ ఏరియా ఆస్పత్రిలో శ్రీను భౌతిక కాయానికి నివాళులర్పిస్తున్న మంత్రి ఉత్తమ్



కుర్రి శ్రీను (ఫైల్)

నకిరేకల్: హైదరాబాద్‌లో శుక్రవారం జరిగిన కాంగ్రెస్ సభకు కారులో వెళ్లొస్తుండగా.. కట్టంగూర్ మండలం పామునగుండ్ల శివారులో లారీ ఢీకొట్టడంతో మఠంపల్లి మండలం కిందితండా గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకుడు కుర్రి శ్రీను మృతిచెందగా. అదే గ్రామానికి చెందిన మరో ఐదుగురికి గాయాలయ్యాయి. పోస్టుమార్టం నిమిత్తం నకిరేకల్ ఏరియా ఆస్పత్రిలో ఉంచిన కుర్రి శ్రీను భౌతికకాయానికి శనివారం నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి నివాళులర్పించారు. ప్రభుత్వ పరంగా శ్రీను కుటుంబానికి రూ.10లక్షలు ఎక్స్‌గ్రేషియా ఇస్తామని మంత్రి ప్రకటించారు. అంతేకాకుండా తక్షణ సహాయం కింద సొంతంగా రూ.5లక్షలు అందజేశారు. మృతుడి భార్యకు ప్రభుత్వం ఉద్యోగం, అతడి పిల్లలకు విద్య అందిస్తామని మంత్రి హామీ ఇచ్చారు. రోడ్డు ప్రమాద ఘటనకు సంబంధించిన వివరాలను నల్లగొండ డీఎస్పీని అడిగి తెలుసుకున్నారు. మృతుడు శ్రీను అంత్యక్రియలను దగ్గరుండి చూసుకోవాలని ఆయన హుజూర్‌నగర్ నియోజకవర్గ నాయకులకు సూచించారు. మంత్రి వెంట నకిరేకల్ ఎమ్మెల్యే వీరేశం సతీమణి పుష్ప, మహిళా కాంగ్రెస్ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు గాజుల సుకన్య, పట్టణ అధ్యక్షుడు లింగాల వెంకన్న తదితరులు ఉన్నారు.

కిందితండాలో విషాదఛాయలు..

మఠంపల్లి: కుర్రి శ్రీను మృతితో కిందితండా గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. మృతుడికి భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. శనివారం రాత్రి శ్రీను అంత్యక్రియలను అశ్రునయనాల మధ్యన పూర్తిచేశారు. కాగా అదే గ్రామానికి చెందిన వీరన్న నాయక్, మాలోతు శ్రీనునాయక్, బాబునాయక్, మేఘానాయక్, నాగేశ్వరరావునాయక్‌కు గాయాలు కావడంతో వారు చికిత్స పొందుతున్నారు.

లారీ డ్రైవర్‌పై కేసు నమోదు..

కట్టంగూర్: ఈ ప్రమాదానికి కారణమైన గుజరాత్ రాష్ట్రానికి చెందిన లారీ డ్రైవర్ జుగ్‌రాజ్‌సింగ్‌పై మృతుడి భార్య కుర్రి శ్రీదేవి ఫిర్యాదు మేరకు శనివారం కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు కట్టంగూర్ ఎస్ఐ రవీదర్ తెలిపారు.

బంధువుల దశదిన కర్మకు వెళ్లొస్తుండగా..

- రోడ్డు ప్రమాదంలో తల్లీకొడుకు మృతి
- కట్టంగూర్ మండల కేంద్రం శివారులో ఘటన



రజనీకాంత్ (ఫైల్)

కట్టంగూర్: బంధువుల దశదిన కర్మకు ద్విచక్ర వాహనంపై వెళ్లొస్తున్న తల్లీకుమారుడు జాతీయ రహదారిపై ఆగి ఉన్న లారీని ఢీకొట్టి మృతి చెందారు. ఈ ఘటన కట్టంగూర్ మండలం కేంద్రం శివారులో శనివారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. హైదరాబాద్‌లోని మన్సూరాబాద్‌కు చెందిన పిట్టల శంకరమ్మ(41), ఆమె కుమారుడు పిట్టల రజనీకాంత్(25) తమ బంధువుల దశదిన కర్మ కార్యక్రమంలో పాల్గొనేందుకు శనివారం ద్విచక్ర వాహనంపై నకిరేకల్ మండలం ఓగోడు గ్రామానికి వచ్చారు. సాయంత్రం హైదరాబాద్‌కు తిరిగి వెళ్తుండగా.. బయలుదేరారు. మార్గమధ్యలో కట్టంగూర్ మండల కేంద్రం శివారులోకి విజయవాడ–హైదరాబాద్ జాతీయ రహదారి పక్కనే ఆగి ఉన్న లారీని వెనుక నుంచి ఢీకొట్టారు. ఈ ప్రమాదంలో రజనీకాంత్ అక్కడికక్కడే మృతిచెందగా.. తీవ్రంగా గాయపడిన శంకరమ్మను నార్కట్‌పల్లి కామినేని ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందింది. మృతుల స్వగ్రామం శాలిగౌరారం మండలం ఊట్కూరు గ్రామం కాగా.. వీరు బతుకుదెరువు నిమిత్తం 30 సంవత్సరాల క్రితమే హైదరాబాద్‌కు వలస వెళ్లారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ మునుగోటి రవీందర్ తెలిపారు.

నిర్లక్ష్యంగా లారీని నిలిపిన డ్రైవర్..

లారీ డ్రైవర్ ఎలాంటి సిగ్నల్ లైట్లు వేయకుండా కట్టంగూర్ మండల కేంద్రం శివారులో విజయవాడ–హైదరాబాద్ జాతీయ రహదారిపై లారీని ఆపి సుమారు రెండు గంటల పాటు నిద్రించాడు. లారీని పూర్తిగా హైవే కిందకు దించకుండా సగ భాగం హైవే పైనే నిలుపడంతో.. రజనీకాంత్ లారీని ఓవర్‌టేక్ చేసే క్రమంలో వెనుక నుంచి మరో వాహనం రావడంతో లారీని వెనుక నుంచి ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో తల్లీకుమారుడు ఎగిరి రోడ్డుపై పడటంతో తలకు తీవ్రగాయాలై మృతి చెందారు.

బైక్‌ను ఢీకొట్టిన కారు.. ముగ్గురికి గాయాలు



క్షతగాత్రులను ఆస్పత్రికి తరలిస్తున్న 108 సిబ్బంది

హాలియా: అతివేగంగా దూసుకొచ్చిన కారు బైక్‌ను ఢీకొట్టడంతో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన అనుముల మండలం కొత్తపల్లి గ్రామంలోని 565వ నంబర్ జాతీయ రహదారిపై శనివారం సాయంత్రం జరిగింది. వివరాలు.. ఏపీలోని పల్నాడు జిల్లా గురజాలకు చెందిన మోరం నాగేశ్వరరావు అతడి భార్య లక్ష్మీపార్వతి, 18 నెలల కుమారుడు అభిరామ్‌తో కలిసి శనివారం బైక్‌పై తిరుమలగిరి(సాగర్) మండలంలోని రంగుండ్ల గ్రామంలో జరిగిన శుభకార్యానికి వచ్చారు. తిరుగు ప్రయాణంలో ముగ్గురు కలిసి బైక్‌పై వెళ్తుండగా.. మార్గమధ్యలో అనుముల మండలం కొత్తపల్లి గ్రామ సమీపంలోకి రాగానే హాలియా నుంచి సాగర్ వైపు వెళ్తున్న కారు అతివేగంగా వచ్చి వీరు బైక్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో నాగేశ్వరరావు, అతడి భార్య, కుమారుడికి తీవ్ర గాయాలయ్యాయి. హాలియా సీఐ సతీష్‌రెడ్డి, ఎస్ఐ సాయిప్రశాంత్ ఘటనా స్థలానికి చేరుకొని క్షతగాత్రులను సాగర్‌లోని కమలానెహ్రూ ఆస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం బాధితులను మాచర్లకు తరలించారు. క్షతగాత్రుల బంధువు లక్ష్మీకాంత్‌రెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ సాయి ప్రశాంత్ తెలిపారు.

అందరు ఉన్నా అనాథ శవంగా..

- జనగామ జిల్లాలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన భువనగిరి వాసి
- 13రోజుల తర్వాత కుటుంబ సభ్యులకు అందిన సమాచారం
- అప్పటికే గుర్తుతెలియని మృతదేహంగా గుర్తించి అంత్యక్రియలు నిర్వహించిన జనగామ పోలీసులు



పవన్ (ఫైల్)

భువనగిరిటౌన్: భువనగిరి పట్టణానికి చెందిన ఓ వ్యక్తికి అందరు ఉన్నా అనాథయ్యాడు. వివరాలు.. భువనగిరి పట్టణంలోని రెడ్డివాడకు చెందిన పట్నం పవన్ (40) గత నెల 21న భార్య కల్పన, ఇద్దరు కుమార్తెలతో కలిసి జనగామ జిల్లా స్టేషన్ ఘన్‌పూర్ మండలం చాగల్ గ్రామంలోని తన అత్తగారింటికి బస్సులో బయల్దేరాడు. మార్గమధ్యలో జనగామలో పవన్ బస్సు దిగి.. తనకు పని ఉంది, చూసుకొని వస్తాను అని భార్యకు చెప్పాడు. కల్పన ఇద్దరు కుమార్తెలతో కలిసి పుట్టింటికి వెళ్లింది. రెండు రోజులు గడిచినా భర్త ఇంటికి రాకపోవడంతో కల్పన భువనగిరిలోని పవన్ కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చింది. ఎంత వెతికినా పవన్ ఆచూకీ లభించకపోవడంతో ఐదు రోజుల అనంతరం జనగామ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీంతో అక్కడి పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేశారు. కానీ అప్పటికే జనగామ మండలం యశ్వంతపూర్ వద్ద పవన్ రోడ్డు ప్రమాదంలో మృతి చెందగా.. జనగామ ప్రభుత్వ ఆస్పత్రి మార్చురీలో నాలుగు రోజులపాటు గుర్తుతెలియని మృతదేహంగా పోలీసులు భద్రపరిచి అనంతరం అంత్యక్రియలు నిర్వహించారు. ఈ క్రమంలో కల్పన భర్త ఆచూకీ కోసం శుక్రవారం జనగామ పోలీస్ స్టేషన్‌కు వెళ్లగా.. గుర్తుతెలియని మృతదేహంగా పేర్కొని అంత్యక్రియలు నిర్వహించిన ఫొటోలు చూపించగా.. తన భర్త పవన్ మృతదేహమే అని ఆమె నిర్ధారించింది. అయితే కల్పన ఫిర్యాదు వెంట పవన్ ఫొటోను జతచేయకపోవడంతో మృతదేహం గుర్తింపులో ఆలస్యం జరిగిందని జనగామ పోలీసులు పేర్కొన్నారు. ఈ మేరకు పవన్ కుటుంబ సభ్యులు, బంధువులు, మిత్రులు శనివారం జనగామలో పవన్ మృతదేహాన్ని ఖననం చేసిన ప్రదేశాన్ని సందర్శించి నివాళులర్పించారు.

కూలి పనికి వెళ్తూ మృత్యుఒడికి..

- ద్విచక్ర వాహనాన్ని ఆర్టీసీ బస్సు ఢీకొట్టడంతో మహిళా కూలీ మృతి
- ఆమె భర్తకు గాయాలు



మల్లమ్మ (ఫైల్)

భువనగిరిటౌన్: కూలి పని చేసే మహిళను ఆమె భర్త ద్విచక్ర వాహనంపై పని ప్రదేశంలో దించేందుకు వెళ్తుండగా ఆర్టీసీ బస్సు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో మహిళ మృతిచెందగా.. ఆమె భర్తకు గాయాలయ్యాయి. ఈ ఘటన భువనగిరి పట్టణంలో శనివారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బీబీనగర్ మండలం ముగ్దుంపల్లికి చెందిన సిల్వేరు సత్యనారాయణ, మల్లమ్మ(45) భార్యాభర్తలు. సత్యనారాయణ బీబీనగర్‌లోనే ఓ కంపెనీలో పనిచేస్తుండగా.. మల్లమ్మ కూలి పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్నారు. శనివారం ఉదయం సత్యనారాయణ తన భార్య మల్లమ్మను భువనగిరిలో కూలీ పనికి వదిలేందుకు ద్విచక్ర వాహనంపై బయల్దేరారు. భువనగిరి పట్టణంలోని జంఖన్నగూడెం చౌరస్తా వద్ద మల్లమ్మ, సత్యనారాయణ ఆగగా.. నల్లగొండ నుంచి భువనగిరి వైపు వస్తున్న ఆర్టీసీ బస్సు అతివేగంగా వచ్చి ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో మల్లమ్మ అక్కడికక్కడే మృతి చెందగా.. సత్యనారాయణకు గాయాలయ్యాయి. వీరికి ముగ్గురు కుమార్తెలు సంతానం కాగా.. ఒక కుమార్తె వివాహం చేశారు. మిగతా ఇద్దరు కుమార్తెలు పాఠశాల విద్య అభ్యసిస్తున్నారు. సమాచారం తెలుసుకున్న భువనగిరి పట్టణ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టమ నిమిత్తం భువనగిరి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి

పెన్‌పహాడ్: ఇంట్లో నీటి మోటారుకు మరమ్మతు చేస్తుండగా విద్యుదాఘాతంతో వ్యక్తి మృతిచెందాడు. ఈ ఘటన పెన్‌పహాడ్ మండలం చెట్లముకుందాపురం గ్రామంలో శనివారం జరిగింది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. చెట్లముకుందాపురం గ్రామానికి చెందిన మామిడి శ్రీనివాస్(54) తన ఇంట్లోని నీటి ట్యాంకు వద్ద మోటారు మరమ్మతు చేస్తుండగా విద్యుదాఘాతానికి గురై మృతిచెందాడు. మృతుడికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు.

ఉగ్రవాదుల చెరలో మిర్యాలగూడ వాసి

- మాలి దేశంలో కిడ్నాప్ అయిన అమరలింగేశ్వరరావు
- ఆందోళనలో కుటుంబ సభ్యులు

మిర్యాలగూడ అర్బన్: బతుకుదెరువు కోసం మాలి దేశం వెళ్లిన వ్యక్తి అక్కడ ఉగ్రవాదులు చేత కిడ్నాప్‌కు గురయ్యారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం పల్నాడు జిల్లా మాచర్ల మండలం జమ్మలమడక గ్రామానికి చెందిన కూరాకుల అమరలింగేశ్వర్‌రావుకు నల్లగొండ జిల్లా అడవిదేవులపల్లి మండల కేంద్రానికి చెందిన రమణతో వివాహం జరిగింది. పిల్లల చదువు కోసం ఆయన కుటుంబంతో మిర్యాలగూడలో నివాసం ఉండేవారు. అమరలింగేశ్వరరావు పల్నాడు జిల్లాలోని దాచేపల్లి మండలం శ్రీనగర్ గ్రామ శివారులో గల డైమండ్ సిమెంట్ పరిశ్రమలో అసిస్టెంట్ మేనేజర్‌గా పనిచేస్తూ ప్రతి రోజూ పరిశ్రమకు రాకపోకలు సాగించేవాడు. అయితే, ఇదే సిమెంట్ పరిశ్రమ యాజమాన్యం సౌత్ ఆఫ్రికాలో మాలి దేశంలోని కేస్ ప్రాంతంలో సిమెంట్ పరిశ్రమను స్థాపించింది. సిమెంటు పరిశ్రమల్లో అనుభవం కలిగిన ఉన్న అమరలింగేశ్వరరావును అక్కడ పనిచేసేందుకు పంపించింది. ప్రస్తుతం అతని భార్య పిల్లలు హైదరాబాద్‌లో నివాసం ఉంటున్నారు. పెద్ద కుమార్తె అమెరికాలో చదువుతున్నారు. రెండవ కుమార్తె హైదరాబాద్‌లో ఉద్యోగం చేస్తుండగా, కుమారుడు చదువుకుంటున్నాడు. ఈ నేపథ్యంలో ఈ నెల 1న డైమండ్ సిమెంట్ ఫ్యాక్టరీపై ఉగ్రవాదులు దాడిచేసి ముగ్గురు భారతీయులను కిడ్నాప్ చేశారు. కిడ్నాకు గురైన వారిలో అమరలింగేశ్వరరావు ఉన్నారు. కిడ్నాప్‌నకు గురైన భారతీయుల సమాచారాన్ని వారి కుటుంబ సభ్యులకు భారత రాయబార కార్యాలయం అధికారులు అందిచారు. దీంతో అమరలింగేశ్వర్‌రావు కుటుంబ సభ్యులు తీవ్ర ఆందోళనకు గురయ్యారు. అమరలింగేశ్వరరావు కిడ్నాప్ విషయమై భార్య పిల్లలతో పాటు బంధువులు కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డిని కలిసి వివరించారు. ఆయన విదేశాంగశాఖ మంత్రితో మాట్లాడి త్వరితగతిన సమస్య పరిష్కరించాలని కోరారు.

గంజాయి విక్రయిస్తున్న ఇద్దరి అరెస్ట్

- 11 కిలోల గంజాయి స్వాధీనం




వివరాలు వెల్లడిస్తున్న సూర్యాపేట జిల్లా ఎస్పీ నరసింహ

సూర్యాపేటటౌన్: గంజాయి విక్రయిస్తున్న ఇద్దరు వ్యక్తులను కోదాడ రూరల్ పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ కేసు వివరాలను శనివారం సూర్యాపేట జిల్లా ఎస్పీ కె. నరసింహ తన కార్యాలయంలో విలేకరులకు వెల్లడించారు. ఎస్పీ తెలిపిన వివరాల ప్రకారం.. కోదాడ మండలం దొరకుంట గ్రామానికి చెందిన అడప రాకేష్ పదిరోజుల క్రితం కోదాడ రూరల్ పోలీస్ స్టేషన్‌లో అతడిపై నమోదైన గంజాయి కేసులో వాయిదాకు హాజరయ్యేందుకు సూర్యాపేట జిల్లా కోర్టుకు వచ్చాడు. అక్కడ అతడికి గంజాయి కేసులోనే వాయిదా గురించి వచ్చిన ఒరిస్సా రాష్ట్రానికి చెందిన వ్యక్తి పరిచయమయ్యాడు. అతడు కూడా గంజాయి కేసు వాయిదా గురించి వచ్చాడని తెలుసుకున్న రాకేష్ తనకు గంజాయి కావాలని అడిగగా.. జూన్ 29న ఒరిస్సా రాష్ట్రంలోని కల్‌మెల్లలోని శివమందిర్ గుడి వద్దకు రావాలని చెప్పాడు. అతడు చెప్పినట్టుగానే జూన్ 28న రాకేష్ ఒరిస్సాకు వెళ్లి అతడిని కలిసి 11కిలోల గంజాయి రూ.11వేలకు కొనుగోలు చేశాడు. ఆ గంజాయిని దొరకుంట గ్రామానికి తీసుకొచ్చి గ్రామ శివారులో గల ఖాళీ స్థలంలో పొదల మధ్యన దాచిపెట్టాడు. ఆ గంజాయిని మరో వ్యక్తికి విక్రయించేందుకు గాను ఈ నెల 2న కోదాడ పట్టణంలోని శ్రీరంగాపురానికి చెందిన వనపర్తి సాయి అలియాస్ సాయికుమార్ ఫోన్ చేశాడు. ఈ నెల 4న సాయికుమార్ గంజాయి కొనుగోలు చేసేందుకు రాకేష్ వద్దకు రాగా నమ్మదగిన సమాచారం మేరకు కోదాడ రూరల్ పోలీసులు వారిద్దరిని పట్టుకున్నారు. వారి వద్ద నుంచి 11 కేజీల గంజాయితో పాటు ఒక సెల్‌ఫోన్ స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు. నిందితుల వద్ద పట్టుబడిన గంజాయి విలువ సుమారు రూ.2.80 లక్షలు ఉంటుందని ఎస్పీ నరసింహ తెలిపారు. అయితే రాకేష్‌పై 2023 సంవత్సరంలో గంజాయి కేసు నమోదయ్యిందని ఎస్పీ పేర్కొన్నారు. నిందితులను పట్టుకున్న సీఐ రజితారెడ్డి, సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ శివకుమార్, కోదాడ రూరల్ ఎస్ఐ అనిల్‌రెడ్డి, సీసీఎస్ ఎస్ఐ హరికృష్ణతో పాటు పోలీస్ సిబ్బందిని ఎస్పీ అభినందించారు. ఈ విలేకరుల సమావేశంలో కోదాడ డీఎస్పీ శ్రీధర్‌రెడ్డి పాల్గొన్నారు.

స్వర్ణగిరిలో జల నారాయణస్వామికి మంగళహారతులు

భువనగిరి: భువనగిరి పట్టణ శివారులోని స్వర్ణగిరి క్షేత్రంలో వేంకటేశ్వరస్వామి దేవాలయం ఆవరణలో శనివారం జల నారాయణస్వామికి మంగళహారతుల సేవ కార్యక్రమాన్ని నిర్వహించారు. అంతకు ముందు ఉదయం స్వామివారికి సుప్రభాత సేవ, తోమాల సేవ, సహస్రనామార్చన సేవ, నిత్య కల్యాణం జరిపించారు. మధ్యాహ్నం సుమారు 5వేల మంది భక్తులకు అన్నదానం చేశారు. సాయంత్రం తిరువీధి ఉత్సవ సేవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.



జల నారాయణస్వామికి మంగళహారతులు సమర్పిస్తున్న అర్చకులు

ఎనిమిది నెలల కుమార్తెతో సహా మహిళ ఆత్మహత్య

- మతిస్థిమితం సరిగా లేక వ్యవసాయ బావిలో దూకి బలవన్మరణం
- తల్లి మృతదేహం లభ్యం
- నల్లగొండ జిల్లా శాలిగౌరారం మండలం వంగమర్తి గ్రామంలో ఘటన



చిన్న కుమార్తె హర్షితతో వాణి (ఫైల్)

శాలిగౌరారం: మానసిక స్థితి సరిగా లేని మహిళ తన ఎనిమిది నెలల కుమార్తెతో కలిసి వ్యవసాయ బావిలో దూకి ఆత్మహత్య చేసుకుంది. ఈ ఘటన నల్లగొండ జిల్లా శాలిగౌరారం మండలం వంగమర్తి గ్రామంలో శనివారం జరిగింది. పోలీసులు, గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. వంగమర్తి గ్రామానికి చెందిన సాయిని శంకరయ్య, వీరమ్మ దంపతుల కుమార్తె వాణి(23)ని యాదాద్రి భువనగిరి జిల్లా రామన్నపేట మండలం ఎన్నారం గ్రామానికి చెందిన సింగారపు మహేశ్‌కి నాలుగేళ్ల క్రితం వివాహం జరిపించారు. మహేశ్, వాణి దంపతులకు ఇద్దరు కుమార్తెలు సంతానం. పెద్ద కుమార్తె పుట్టిన సమయంలోనే వాణి మానసిక స్థితి దెబ్బతినడంతో అనారోగ్యానికి గురైంది. దీంతో వాణిని ఆమె తల్లిదండ్రులు వైద్యం కోసం ఆస్పత్రుల్లో చూపిస్తున్నారు. ఈ క్రమంలో వాణి తరచూ తన తల్లిగారింటికి వచ్చి వెళ్తుండేది. నెల రోజుల క్రితం పెద్ద కుమార్తెను భర్త వద్ద ఉంచి చిన్న కుమార్తె హర్షిత(8 నెలలు)తో కలిసి వాణి వంగమర్తిలోని తల్లిగారింటికి వచ్చి ఉంటుంది.

అంగన్‌వాడీ కేంద్రానికి బయల్దేరి..

శనివారం వాణి తన చిన్న కుమార్తె హర్షితతో కలిసి ఇంటి వద్ద ఉండగా ఆమె తల్లిదండ్రులు పొలం వద్దకు వెళ్లారు. వాణి తన కుమార్తెను తీసుకొని మధ్యాహ్నం సమయంలో అంగన్‌వాడీ కేంద్రానికి వెళ్లొస్తానని చుట్టుపక్కల వారికి చెప్పి ఇంట్లో నుంచి బయటకు వెళ్లింది. కానీ వాణి అంగన్‌వాడీ కేంద్రానికి వెళ్లకుండా వంగమర్తి గ్రామ సమీపంలోని 365వ నంబర్ జాతీయ రహదారిపై నడుచుకుంటూ వెళ్లి హైవే పక్కన ఉన్న నిరుపయోగంగా ఉన్న వ్యవసాయ బావిలో కుమార్తెతో పాటు దూకింది. మధ్యాహ్నం తర్వాత ఇంటికి వచ్చిన వాణి తల్లిదండ్రులు కుమార్తె ఇంట్లో కనిపించకపోయేసరికి చుట్టుపక్కల వారిని అడిగారు. దీంతో వారు అంగన్‌వాడీ కేంద్రానికి వెళ్తున్నానని చెప్పిందని తెలిపారు. అంగన్‌వాడీ కేంద్రానికి వెళ్లి అడుగగా అక్కడకు రాలేదని అంగన్‌వాడీ సిబ్బంది తెలిపారు. ఆందోళనకు గురైన వాణి తల్లిదండ్రులు ఎన్నారం గ్రామానికి ఫోన్ చేసి వాణి వచ్చిందేమోనని ఆరా తీశారు. కానీ అక్కడకు కూడా వాణి రాలేదని చెప్పడంతో గ్రామంలో ఆరా తీయగా.. రెండు గంటల ముందు కుమార్తెతో కలిసి వాణి జాతీయ రహదారి వెంట మాధారంకలాన్ వైపు నడుచుకుంటూ వెళ్లిందని గ్రామస్తులు తెలిపారు. వాణి తల్లిదండ్రులతో పాటు స్థానికులు జాతీయ రహదారి వెంట గాలిస్తూ.. నిరుపయోగంగా ఉన్న వ్యవసాయ బావిలో చూడగా అప్పటికే వాణి మృతిచెంది నీటిలో తేలియాడుతూ కనిపించింది. వాణి మృతదేహాన్ని బయటకు తీసి పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఎస్ఐ సైదులు ఘటనా స్థలానికి చేరుకుని నకిరేకల్‌లోని ఫైర్ స్టేషన్‌కు సమాచారం అందించారు. ఫైర్ సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని చిన్నారి హర్షిత మృతదేహం కోసం తీవ్రంగా గాలించారు. అప్పటికే రాత్రి కావడంతో గాలింపు చేపట్టడం సాధ్యం కాకపోవడంతో నిలిపివేశారు. రాత్రి వరకు చిన్నారి హర్షిత మృతదేహం లభ్యంకాలేదు. మృతురాలి తండ్రి సాయిని శంకరయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని వాణి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నకిరేకల్ ప్రభుత్వాస్పత్రికి తరలించి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సైదులు వివరించారు.